క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సామేల్

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో నెమురుగొమ్ముల రజిత ఇటీవల మరణించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రజిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, సుంకరి జనార్దన్, జమ్మిలాల్, పేరాల వీరేష్, కందుకూరి అంబేద్కర్, పత్తెపురం సుధాకర్, యాదగిరి, యాకయ్య పాల్గొన్నారు.

నారాయణపురం వాసికి జాతీయ అవార్డు



కేంద్ర మంత్రి జీతూ లాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జానకిరామ్

చిలుకూరు : నారాయణపురం గ్రామానికి చెందిన డాక్టర్ జానకిరామ్‌కు ఎంబీబీఎస్ ఎమర్జెన్సీ ఫిజిషియన్ విభాగంలో నేషనల్ ఎమర్జెన్సీ ఫిజిషియన్ ఆఫ్ ది ఇయర్ – 2024 అవార్డు లభించింది. ఢిల్లీలో ఈ నెల 20వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జీతూ లాల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. వైద్య వృత్తిలో తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు ఇచ్చినట్లు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు.

పీహెచ్‌సీ ఆవరణలో కంపచెట్లు తొలగింపు



కొనసాగుతున్న పనులు

అర్వపల్లి : కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఈ నెల 22న అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆవరణ పూర్తిగా పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండి అధ్వానంగా ఉండడంతో పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య గ్రామపంచాయతీ సిబ్బందితో గడ్డిమందు పిచికారీ చేయించారు. శుక్రవారం డోజర్‌ను ఏర్పాటుచేసి పిచ్చిచెట్లు తొలగించారు.

ఆలయంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో ఉన్న శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయంలోని అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి మాట్లాడారు. 41 రోజుల పాటు కొనసాగే ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు దాతలు సహకారం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యనారాయణ, వంగవేటి వెంకటగురుమూర్తి, పెనుగొండ వెంకట దుర్గాప్రసాద్, గాయం సత్యనారాయణరెడ్డి, గురుస్వాములు పాల్గొన్నారు.

'కోమటిరెడ్డిని విమర్శించే స్థాయి కిషోర్‌కు లేదు'

నాగారం : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బిక్కి శ్రీను అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కదారి సోమయ్య, చిప్పపల్లి ఉపేందర్, కొంపెల్లి శ్రీనివాస్, కొమ్ము యాకస్వామి, కడియం శ్యాంప్రసాద్, పత్తేపురం రాఖీ, మల్లేపాక గణేష్ పాల్గొన్నారు.

ఒకే ఈతలో గేదెకు రెండు దూడలు



పెన్‌పహాడ్ : ఒకే ఈతలో గేదె రెండు దూడలకు జన్మనిచ్చింది. పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్ ఆవాసం దుబ్బగూడెం గ్రామంలో రైతు ఎదుళ్ల రాంరెడ్డికి చెందిన గేదె శుక్రవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. దూడలు రెండూ ఆరోగ్యంగా ఉన్నాయి.

వీధుల్లో కుక్కలు.. పంటలపై కోతులు

- గ్రామాల్లో పెరుగుతున్న వానరాలు, శునకాల బెడద
- వ్యవసాయ భూముల్లో పంటలను ధ్వంసం చేస్తున్న కోతులు
- వీధుల్లో ఒంటరిగా వెళ్తున్న వారిపై కుక్కల దాడులు



ఏనుబాములలోని ఓ వీధిలో కుక్కల గుంపు



ఆత్మకూరు మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఓ వైపు కోతులు, మరోవైపు కుక్కల బెడదతో అవస్థలు పడుతున్నారు. వీటి బెడద తప్పేదెలా అంటూ వాపోతున్నారు.

కోతుల విహారం.. పంటలు ధ్వంసం

వ్యవసాయ భూముల్లో సాగు చేసే వేరుశనగ, పెసర, కంది, పత్తితోపాటు చివరకు వరి పంటను కూడా కోతులు నాశనం చేస్తున్నాయి. ఒకప్పుడు మెట్ట పంటలను మాత్రమే నాశనం చేసే కోతులు ఇప్పుడు.. వరి పంటను కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. వరి పొట్టదశలో ఉన్న సమయంలో కంకులను పీకి తింటున్నాయి. ఏ పంటపైకి వెళ్లినా వందలాది కోతులు ఉండడంతో వాటిని తరిమేందుకు రైతులు భయపడుతున్నారు. ఇద్దరు, ముగ్గురు రైతులు కలిసి తరిమినా.. మరుసటి రోజే తిరిగి వస్తున్నాయి.

వీధుల్లో కుక్కల గుంపు..

మండల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడద కూడా తీవ్రంగానే ఉంది. ఏ వీధికి వెళ్లినా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటి భయానికి వృద్ధులు, చిన్నారులు బయటికి రావడానికి జంకుతున్నారు. కుక్కలు ఒంటరిగా వెళ్లే వ్యక్తులపై దాడి చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. గొర్రెలు, మేకల మందలపై దాడి చేసి వెంటాడి చంపుతున్నాయి. దీంతో జీవాల యజమానులు వేలాది రూపాయలను నష్టపోతున్నారు. అయినా గ్రామపంచాయతీ అధికారులు స్పందించడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

గొర్రె పిల్లలను చంపేశాయి



గ్రామాల్లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇళ్లలో ఉండే, మేతకు వెళ్లిన పశువులు, జీవాలపై దాడులు చేస్తున్నాయి. వీటి నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులు కుక్కల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

– తగుళ్ల సైదులుయాదవ్, ఏనుబాముల

ఏ పంట వేయాలన్నా భయమేస్తోంది



కోతుల కారణంగా వ్యవసాయ భూముల్లో ఏ పంట వేయాలన్నా భయమేస్తోంది. గతంలో ఆరుతడి పంటలను వేస్తే ఇబ్బందులు పడేవాళ్లం. ఏ సమయంలో కోతులు వస్తాయోనని భయపడేవాళ్లం. ఇప్పుడు వరి పొలాన్ని కూడా కోతులు వదలడం లేదు. కోతుల బెడద లేకుండా చూడాలి.

– పందిరి కృష్ణారెడ్డి, ఆత్మకూర్ (ఎస్)

ఎస్పీ కార్యాలయంలో ఓపెన్ హౌజ్

సూర్యాపేట టౌన్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఆయుధాలను ప్రదర్శించి వాని వినియోగం గురించి తెలియజేశారు. కేసుల దర్యాప్తులో క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ విభాగం, డాగ్, బాంబ్ స్క్వాడ్‌ల విధులతోపాటు మహిళల రక్షణలో షీ టీమ్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు నాగేశ్వర్ రావు, జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఆర్ఐ నారాయణ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



షీటీమ్‌పై బాలికలకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఎస్ఐ నీలిమ



క్లూస్ టీమ్ గురించి వివరిస్తున్న పోలీసులు



డాగ్ స్క్వాడ్ గురించి అవగాహన..

సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలి

తుంగతుర్తి : సీసీఐ కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలతో పత్తి రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పత్తి దిగుబడి వస్తున్నా నేటికీ సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు దళారులకు పత్తి అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు. ఆయనతో పాటు రాములుగౌడ్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలి



మున్సిపాలిటీ అధికారులకు ఒప్పంద పత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

సూర్యాపేట : ప్రభుత్వ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవన నిర్మాణాలు చేట్టాలని పట్టణంలోని 10వ వార్డు ప్రజలు కోరారు. శుక్రవారం యాదవ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో సుతారీ యూనియన్ భవన నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేయగా తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్ఐ గోపి మున్సిపల్ సిబ్బందితో కలిసి స్థలంలో పంచనామా చేశారు. అనంతరం వార్డు ప్రజలు మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడేలా బస్తీ దవాఖానా, గ్రంథాలయం, ఓపెన్ జిమ్, పార్క్ లాంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలన్నారు. స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులు స్వాధీనం చేసుకోవాలనే ఒప్పంద పత్రంపై రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రామస్తులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కొత్త మధు, రఫీ, గ్రామస్తులు కోడి నాగరాజు, చెరుకుపల్లి నాగరాజు, ఉపేందర్, లొడంగి నాగరాజు, దాసరి శంకర్, మామిళ్ల నాగరాజు, టంగుటూరి నాగమ్మ, బొల్లం రాము, చెరుకుపల్లి తిరపతమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న గౌతమ్‌రావు, తదితరులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామం నుంచి వెళ్తున్న 930పీ నేషనల్ హైవేపై గ్రామస్తుల అభ్యర్థన మేరకు అండర్‌పాస్ మంజూరైనట్లు హైదరాబాద్ సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు ఎస్.గౌతమ్‌రావు తెలిపారు. శుక్రవారం తొండ గ్రామ బస్టాండ్ సమీపంలో అండర్‌పాస్ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. అండర్‌పాస్ నిర్మాణ కోసం త్వరలోనే టెండర్లు పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శాతవాహన రావు, రజనీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రామారావు, ఎల్లయ్య, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యం



బి.చందుపట్లలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చివ్వెంల : గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యమని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంతుల మధు, ఆ సంస్థ ప్రతినిధులు రామక్రిష్ణ, మహేష్ అన్నారు. శుక్రవారం బి.చందుపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, గ్రామర్ బుక్స్, డిక్షనరీలు, జాతీయ నాయకుల చిత్రపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుక నగేష్, గుద్దేటి చిన్న వెంకన్న, భుక్యా వెంకన్న, కోడి రవి, గుద్దేటి మధుసూదన్, శిగ నాగరాజు, కోడి లక్ష్మణ్, ముక్కంటి, మల్లేష్, బయ్య కేసీఆర్, ఉపాధ్యాయులు గురుమూర్తి, రామ్మూర్తి, అరుణశ్రీ, యాదయ్య పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నూతనకల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. చిల్పకుంట్లలో 32 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, రాజకీయాలకు అతీతంగా పేదలకు అందించాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్తెయ్య, కందాల శంకర్‌రెడ్డి, లింగయ్య, తిరుమలేష్, సైదులు, విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లైట్లు వెలగక రహదారి అంధకారం

అర్వపల్లి : అర్వపల్లిలోని 365బీ హైవేపై పదిహేను రోజులుగా సెంట్రల్ లైట్లు వెలగక అంధకారంగా మారింది. ఈ లైట్లు మరమ్మతుకు నోచుకోకపోవడంతో జాతీయ రహదారి చీకటిగా ఉండి స్థానికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైట్లను పునరుద్ధరించాలని, ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



జనగామ రోడ్డులో సెంట్రల్ లైట్లు వెలగక అంధకారంగా మారిన రహదారి



లైట్లు వెలగక చీకటిమయంగా మారిన అర్వపల్లిలోని పోలీస్‌స్టేషన్ రోడ్డు

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



మద్దిరాల : కుంటపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

మద్దిరాల : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సన్నాలకు రూ.500 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, నాయకులు పచ్చిపాల సుమతి వెంకన్న, మార్త కృష్ణమూర్తి, కోడి శ్రీశైలం, పొన్నం వెంకన్న, మద్దెల భిక్షపతి గౌడ్, చామకూరి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, సాయి రెడ్డి, కోతి శ్రీధర్ రెడ్డి, మద్దెల నరేష్, వెంకట్, రమేష్, అంజయ్య, కోటి, మధు, తహసీల్దార్ అమిన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, ఏపీఎం మైసయ్య, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

చివ్వెంల : రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూర్యాపేట డీపీఎం రత్తయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల వద్ద మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరబెట్టిన, తేమ లేకుండా ఉన్న ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సైదయ్య, సీసీలు ఉపేందర్, వెంకన్న, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం మల్లేష్ కోరారు. మండల పరిధిలోని లోయపల్లిలో శుక్రవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో సంఘబంధం అధ్యక్షురాలు చేడె సరస్వతి, సీసీ నగేష్, వీఓఏ టి.సరోజన, గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లపు అంజి, వీరాచారి, సీహెచ్. విజయ్, గాదరి పురుషోత్తం, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మణెమ్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

అర్వపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి 17 శాతం లోపు తేమ ఉండేలా చూసుకొని కేంద్రాలకు తేవాలని సూచించారు. అర్వపల్లిలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య, సంఘబంధం అధ్యక్షురాలు మేకల సునీత, వీఓఏ కృష్ణకుమారి, నిర్వాహకులు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : అక్కలదేవిగూడెంలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం రత్తయ్య



అర్వపల్లి : లోయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం మల్లేష్



అర్వపల్లిలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పవన్‌కుమార్

పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

నాగారం : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సబ్‌సెంటర్ డాక్టర్ యుగేంధర్ అన్నారు. శుక్రవారం వర్ధమానుకోటలోని పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైరల్ ఫీవర్స్, సీజనల్ వ్యాధులు, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు వర్దెల్లి మల్లయ్య, అనిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పాటిమీదిగూడెంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యుగేంధర్

27న సీపీఎం మహాసభ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సీపీఎం 8వ మహాసభ తిమ్మాపురంలోని ఇందుర్తి రాఘవరెడ్డినగర్‌లో ఈ నెల 27న జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి తదితరులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

కూలీలు దొరక్క చేలల్లోనే పత్తి



ఫణిగిరిలో కూలీల కొరతతో చేనులోనే ఉన్న పత్తి

నాగారం : మండలంలో పత్తితీతకు కూలీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కూలీకి రూ.300, ఆటో కిరాయి రూ.50 కూడా రైతే భరించి మొత్తం రూ.350 ఇస్తేగాని కూలీలు వచ్చే పరిస్థితిలేదు. నాగారం, ఫణిగిరి, వర్ధమానుకోట, ఈటూరు, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పత్తి తీసినందుకు కూలీలకు కేజీకి రూ.20 నుంచి రూ.30 చెల్లిస్తామన్నా కూలీలు దొరకడంలేదు. పంట దిగుబడి లేక ఓవైపు, పత్తి ఏరేందుకు కూలీలు దొరక్క మరోవైపు రైతులు ఆందోళన చెందుతున్నారు.

చేనులోనే పత్తి రాలుతోంది



పత్తి తీసేందుకు కూలీలు దొరక్కపోవడంతో చేనులోనే పత్తి రాలుతోంది. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూలీలకు రూ.350 చెల్లించి పత్తి ఏరిద్దామన్నా రావడంలేదు. ఈ ఏదాది పంట దిగుబడి కూడా అనుకున్నంత రాలేదు. దీనికితోడు గిట్టుబాటు ధర లేదు.

– బండగొర్ల దుర్గయ్య, రైతు, పస్తాల

ఆన్‌లైన్ వ్యాపారాలతో మోసపోవద్దు

నడిగూడెం : ఆన్‌లైన్ వ్యాపారాలతో మోసపోవద్దని నడిగూడెం ఎస్ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా కొత్త కొత్త ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. ప్రజలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దన్నారు. మండలంలో ఈ మధ్యకాలంలో ఆర్‌జీపీ యాప్ సంస్థ ఎత్తివేయడంతో అందులో పెట్టుబడి పెట్టిన అనేక మంది నష్టపోయారని తెలిపారు. ఆన్‌లైన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నాగారం : పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ ఎం.ఐలయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రక్తదాన శిబిరంలో మండల ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని అన్నారు. ఆయనతోపాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రూ.50 వేల ఆర్థికసాయం

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండారు గుర్వయ్య (32) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతునిది నిరుపేద కుటుంబం. దీంతో గుర్వయ్య చిన్న నాటి మిత్రులు శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మృతుడి స్నేహితులు లంజపల్లి వీరబాబు, షేక్.నాగుల్ మీరా, షేక్.రహిముద్దీన్, బండారు శ్రీను, సత్యం, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్లీనరీని జయప్రదం చేయాలి

మునగాల : హైదరాబాద్ శివారులోని ఆదిభట్లలో నవంబర్ 3వ తేదీన నిర్వహించ తలపెట్టిన ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) తొలి ప్లీనరీని విజయవంతం చేయాలని పార్టీ మునగాల మండల కన్వీనర్ పిడమర్తి నరేష్ మహారాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆయన ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల ప్రకారం అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థపై బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. 90 శాతం మంది అణగారిన వర్గాలు తమ సొంత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కమిటీ సభ్యులు పిడమర్తి ఏసు, పాతకుంట్ల వెంకటేష్, పాలకుంట్ల విజయ్, బత్తిని నవీన్, ఎస్‌కె.రఫీ, ఉప్పరి సందీప్, మామిడి ఏసు, మామిడి నరసింహ, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.